**విజయవాడ నగర పోలీస్ కమీషనర్ కార్యాలయము**

**పత్రికా ప్రకటన** **తేది.15-03-2017.**

# బ్యాంక్ నుండి ఫోన్ చేస్తున్నాం మీకు లోను ఇప్పిస్తాం అని మోసం చేసి అమాయకుల అకౌంట్లలో నగదును కాజేస్తున్న వ్యక్తి అరెస్టు

నవంబర్ 2016లో పటమటలంకకు చెందిన వ్యక్తి కృష్ణలంక పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఎవరో తెలియని వ్యక్తి తనకు ఫోన్ చేసి తన బ్యాంక్ అకౌంట్ నెంబర్ మరియు ఎ.టి.యం.ల నెంబర్లను తీసుకుని తన అకౌంట్‌నుండి నగదును కాజేసినట్లు ఫిర్యాదు చేసినారు. వెంటనే ఈ కేసు వివరాలను సేకరించి పై అధికారుల సూచనల మేరకు కృష్ణలంక పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టడం జరిగింది. ఈ క్రమంలో నగరంలో జరుగుతున్న పలు రకాల సైబర్ మోసాలపై నగర పోలీస్ కమీషనర్‌గారు ప్రత్యేక దృష్టిసారించారు.

పైకేసు దర్యాప్తులో నగర పోలీస్ కమీషనర్ గారి ఆదేశాల మేరకు డిప్యూటీ పోలీస్ కమీషనర్ గారి పర్యవేక్షణలో అసిస్టెంట్ పోలీస్ కమీషనర్ ఆధ్వర్యంలో కృష్ణలంక పోలీసు వారు ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి అనుమానితులపై గట్టి నిఘాను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ క్రమంలో ప్రత్యేక బృందానికి రాబడిన పక్కా సమాచారం మేరకు ఈ రోజు ఉదయం 10 గంటల సమయంలో హైదరాబాదు చేరుకుని సికింద్రబాదు, తిరుమలగిరి ఆర్.టి.సి కాలనీ సమీపంలో ఒక వ్యక్తిని అదుపులోనికి తీసుకుని విచారించి అతనే నిందితుడుగా తేలడంతో నిందితున్ని అదుపులోకి తీసుకుని అరెస్టు చేయడం జరిగింది.

వివరాల్లోకి వెళితే.... నిందితుడు ప్రకాశం జిల్లా, ఒంగోలులోని చోడవరం గ్రామానికి చెందిన రావిపాటి మాధవరావు అలియాస్ మాధవ (36) ఇతను ప్రస్తుతం హైదరాబాదులో గత 17 సంవత్సరాలుగా ఉంటున్నాడు. ఇతను గతంలో ఒక ప్రముఖ కంపెనీలో మేనేజర్‌గా పనిచేసి మానేసినాడు. మేనేజర్‌గా పనిచేయు సమయంలో విలాసాలకు అలవాటు పడి, విపరీతంగా నగదును ఖర్చు చేస్తూ జల్సా చేసేవాడు. గత కొంత కాలంగా ఉద్యోగాన్ని మానేసి, ఇంటిలోనే ఉంటున్నాడు. ఈ క్రమంలో తన జల్సాలకు ఏవిధంగానైనా డబ్బు సంపాధించాలనే ఉద్ధేశంతో తాను చదువుకున్న బి.టెక్‌ను ఉపయోగించుకుని మరియు తాను మేనేజర్‌గా పనిచేస్తున్న సమయంలో తన తోటి ఉద్యోగి సహాయంతో నకిలీ గుర్తింపు కార్డులను తయారు చేసుకుని వాటితో ఫోన్ సిమ్‌లను తీసుకుని, వీటి సహాయంతో బ్యాంక్ అకౌంట్లను ఓపెన్ చేశాడు.

తాను పనిచేసిన సమయంలో ఉన్న పాత కస్టమర్ల ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి నేను బ్యాంక్ మేనేజర్‌ని మాట్లాడుతున్నాను, మీ ఎ.టి.యం కార్డు ఎందుకు వాడటం లేదు మీరు అందులో తగిన నగదును ఉంచడం లేదు అని చెప్పడం. మరియు మీరు మీ అకౌంట్లలో తగిన నగదును ఉంచినచో దాని ప్రకారం మీకు వడ్డీ లేకుండా లోన్లు ఇప్పిస్తాను వారిని మాయమాటల్లో పెట్టి వారి అకౌంట్లలో నగదును వేసుకోవల్సిందిగా చెపుతాడు. తరువాత రెండు మూడు రోజులకు మళ్ళీ ఫోన్ చేసి మీ ఎ.టి.యం కార్డు నెంబరు, వెనుక ఉన్న పిన్ నెంబరు చెప్పండి అని అడిగి వారి అకౌంట్లలో ఉన్న నగదును తాను నకిలీ గుర్తింపు కార్డుల సహాయంతో ఓపెన్ చేసిన అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేసుకుని తరువాత వాటిని డ్రా చేసుకుని జల్సాలు చేస్తున్నాడు.

**(మిగతా.... 2వ పేజిలో...)**

అంతేకాకుండా నేరుగా తన అకౌంట్‌లోనికి ట్రాన్స్‌ఫర్ చేసుకుంటే దొరికిపోతామనే ఉద్దేశంతో కొన్ని కొన్ని సార్లు ఆన్‌లైన్ ద్వారా ఆన్‌లైన్‌లో ఆడుకునే కొన్ని ఆటలకు నగదును ట్రాన్స్‌ఫర్ చేసుకుని తరువాత ఆ నగదును తన అకౌంట్లకు ట్రాన్స్‌ఫర్ చేసుకునేవాడు.

ఈ విధంగా గత సంవత్సర కాలంగా తాను చదువుకున్న చదువును మరియు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని నకిలి గుర్తింపుకార్డులను తయారు చేసి వాటి ద్వారా నకిలి బ్యాంక్ అకౌంట్లను ఒపెన్ చేసి వాటిని ఉపయోగించుకుని ఇతరులకు తెలియకుండా వారిని మోసం చేసి వారి వారి అకౌంట్లనుండి ఈ అకౌంట్లకు నగదును పైన తెలిపిన విధంగా ట్రాన్స్‌ఫర్ చేసుకుని వచ్చిన నగదుతో జల్సాలు చేసేవాడు. ఈ విధంగా హైదరాబాదులో ఇద్దరు వ్యక్తులను మరియు విజయవాడలో కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో నివసిస్తున్న ఒక వ్యక్తిని, అజిత్‌సింగ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నివసిస్తున్న ఒక వ్యక్తులకు ఫోన్ చేసి వారిని మాయమాటల్లోపెట్టి వారి వారి అకౌంట్లనుండి సుమారుగా రెండు లక్షల నగదును తస్కరించినాడు.

ది.14.03.2017న కృష్ణలంక పోలీసులకు రాబడిన పక్కా సమాచారం మేరకు ఈ రోజున అనగా ది.15.03.2017న ఉదయం 10 గంటల సమయంలో హైదరాబాదు చేరుకుని సికింద్రబాదు, తిరుమలగిరి ఆర్.టి.సి కాలనీ సమీపంలో నిందితున్ని అదుపులోకి తీసుకుని అరెస్టు చేయడం జరిగింది.

నోట్:- నగర ప్రజలందరూ గమనించవల్సింది ఏమనగా ఏ బ్యాంక్‌వారు కూడా మీ ఫోన్ నెంబర్లకు ఫోన్‌చేసి మీ అకౌంట్ వివరాలు, ఎ.టి.యం. వివరాలను అడగరు. కాబట్టి ఎవ్వరికైనా ఇటువంటి వివరాలు కావాలని ఫోన్ చేసిన ఎడల వెంటనే దయల్ 100కు గాని, దగ్గర్లోని పోలీస్‌స్టేషన్‌కు ఫోన్‌ద్వారా లేదా నేరుగా వచ్చి వివరాలు కావాలని ఫోన్ చేసిన వారి ఫోన్ నెంబర్ మరియు వివరాలను అందించిన ఎడల వారిపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ఇది ప్రజలందరూ గమనించవల్సిందిగా కోరుతున్నాము.

---xx---